# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 305 | పేజీలు: 4 | వెల: 4/- | బుధవారం ● 15, మే 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి




3లో...

**గురుకుల పాఠశాల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

# ఎన్నికల తర్వాత ప్రాంతీయ పార్టీలదే హవా

- ఇండియా,ఎన్డీఏ కూటమిలకు షాక్
- ప్రాంతీయ పార్టీలదే ఇక హవా
- బిఆర్ఎస్, వైకాపాలు కీలక భూమిక పోషిస్తాయి
- కాంగ్రెస్, బిజెపిలను ప్రజలు తిరస్కరించారు
- బిఆర్ఎస్ కార్యకర్తలు కష్టపడి పనిచేశారు
- కెసిఆర్ బస్సుయాత్రతో అనుకూలంగా పరిస్థితులు
- మీడియా సమావేశంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్



**రాజన్న సిరిసిల్ల,మే14 (నమస్తే ఉదయం):** పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఈ దేశంలో ప్రాంతీయ పార్టీలే హవా కొనసాగించబోతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఇండియా, ఎన్డీఏ కూటమిలకు స్పష్టమైన మెజార్టీ వచ్చే పరిస్థితి లేదని కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ఇండియా, ఎన్డీఏ కూటమిలో లేని పార్టీలు.. బీఆర్ఎస్, వైఎస్సార్‌సీపీ, బీజూ జనతాదళ్ లాంటి ప్రాంతీయ శక్తులే కేంద్రంలో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తాయన్నారు. ఇకపోతే ఐదు నెలలు కాంగ్రెస్ ప్రభుత్వం టైం పాస్‌గా నడిపింది. ప్రజల సమస్యల పట్ల అవగాహన లేకుండా.. అన్ని చిల్లరమల్లర అంశాలు తీసుకుని మేడిగడ్డ, శ్వేతపత్రాలు, ఫోన్ ట్యాపింగ్ వంటి అంశాలపై ఫోకస్ చేసి ప్రజల దృష్టి మరల్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం యత్నించిందని కేటీఆర్ మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ సైనికులు అద్భుతమైన పోరాట పటిమ ప్రదర్శించారు. ఈ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించబోతున్నాం. తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ అత్యధిక స్థానాల్లో గెలవబోతుంది. ఈనాడైనా ఏనాడైనా బీఆర్ఎస్ పార్టీనే తెలంగాణ ప్రయోజనాలకు శ్రీరామరక్ష అని ప్రజలకు అర్థమైంది. ఆ రెండు పార్టీలు సన్నాయి నొక్కులు నొక్కడానికి, విమర్శలు చేయడానికి, కేసీఆర్‌ను దూషించడానికి పరిమితం అయ్యాయన్నారు. తెలంగాణకు ఏం చేయకపోయినా అడ్డగోలు విమర్శలు చేశాయి. వీరి వల్ల ఏం కాదని ప్రజలకు అర్థమైపోయింది. ఈ ఎన్నికల్లో చేసిన కృషి స్థానిక సంస్థల ఎన్నికలకు పునాది కాబోతుందని కేటీఆర్ పేర్కొన్నారు. ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీకి అయితే పరిస్థితి బాగుండదు. ఈ ఐదు నెలల్లోనే ఎక్కడ లేని వ్యతిరేకతను మూటగట్టుకుంది. ఐదు నెలల్లోనే అసాధారణ వ్యతిరేకత వచ్చిందన్నారు. అడ్డగోలు హామీలిచ్చి నెరవేర్చలేదనే కోపంతో ప్రజలు ఉన్నట్లు పలువురు నాయకులు చెబుతున్నారు. ఈ ఎన్నికల తర్వాతనైనా కాంగ్రెస్ బుద్ధి తెచ్చుకొని 420 హామీలు అమలు చేయకపోతే ప్రజాక్షేత్రంలో పరాభవం తప్పదు అని కేటీఆర్ హెచ్చరించారు. కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. ఢిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ అన్నట్టు ఈ రెండు పార్టీల వైఖరి ఉందని కేటీఆర్ మండిపడ్డారు. రాష్ట్రంలో మా ప్రభుత్వం చేసిన మంచి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేస్తోంది. కొత్త జిల్లాలను రద్దు చేయాలని, కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలని చిల్లర ప్రయత్నం చేస్తున్నారు. ఆరు గ్యారెంటీలను తుంగలో తొక్కారు. రైతుభరోసా అని చెప్పి మోసం చేశారు. రుణమాఫీ విషయంలో తేదీలు మార్చుతూ సీఎం ఒట్లకు పరిమితమయ్యారు. రైతాంగమంతా కేసీఆర్ ఉన్నప్పుడే వ్యవసాయం బాగుండే అంటున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి రైతులు కర్రుకాల్చి వాత పెట్టినట్టు అర్థమైంది. ఆ వ్యతిరేకత ఓట్ల రూపంలో కనబడుతుంది. ఆడబిడ్డల్లో కూడా కాంగ్రెస్ పార్టీ పట్ల తీవ్రమైన వ్యతిరేకత కనబడింది. కోటి 67 లక్షల మంది ఆడబిడ్డలకు 100 రోజుల్లో 2500 ఇస్తామన్నారు. తులం బంగారం, స్కూటీ అన్నారు.. ఈ హామీలు నెరవేరలేదు. మంచినీళ్ల కోసం బిందెలు పట్టుకుని రోడెక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో మహిళలు ఈ ప్రభుత్వాన్ని క్షమించే పరిస్థితి లేదు. 4 వేల పెన్షన్ ఇవ్వలేదు. ఈ ఐదు నెలల కాలంలో కాంగ్రెస్‌కు తోడైంది మిగతా.. 2లో

# రైతు సంక్షేమ కార్పొరేషన్

## ఏర్పాటు చేసి రుణం తీసుకుంటాం.. దాని ద్వారానే రైతు రుణమాఫీ



- సన్న వడ్లు పండిస్తేనే రూ.500 బోనస్
- రైతుల పంట ఉత్పత్తులు సేకరించి
- రేషన్ షాపుల ద్వారా పేదలకు సరఫరా
- వచ్చే పదేళ్లూ రాష్ట్ర పాలనలోనే ఉంటా
- ఫోన్ ట్యాపింగ్‌పై అసెంబ్లీలోనే చెబుతాం
- ఏపీలో ఎవరు ముఖ్యమంత్రి అయినా
- సత్సంబంధాలు పెట్టుకుంటాం
- సమస్యలు శాశ్వతంగా పరిష్కరించుకుంటాం
- కేంద్రపాలిత ప్రాంతం విఫల ప్రయోగం
- మండలాలు, రెవెన్యూ డివిజన్ల
- హేతుబద్ధీకరణ చేశాకే జిల్లాలపై ఆలోచన
- రాష్ట్రంలో 13 పార్లమెంటు స్థానాల్లో గెలుస్తాం
- ఆరు సీట్లలో బీఆర్ఎస్ డిపాజిట్లు కోల్పోతుంది
- మెదక్‌లో మాత్రమే ఆ పార్టీ పోటీ ఇస్తుంది
- కంటోన్మెంట్‌లో 20 వేల మెజారిటీ వస్తుంది
- మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, మే 14 (నమస్తే ఉదయం):** రాష్ట్రంలో రైతు సంక్షేమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆ కార్పొరేషన్ ద్వారా ఆదాయం చూపించి రుణం తీసుకుంటామని, దాని ద్వారానే రైతుల రుణమాఫీ అమలు చేస్తామని ప్రకటించారు. మంగళవారం తన నివాసంలో మీడియాతో ముఖ్యమంత్రి చిట్‌చాట్‌గా మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికలు రాష్ట్రంలో ముగిసినందున ఇక పరిపాలనపైనే వందశాతం దృష్టి పెడతామని, బుధవారం నుంచి సచివాలయానికి వెళతానని చెప్పారు. ముందుగా తడిసిన ధాన్యం కొనుగోలు చేయడంపై, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంపై ఫోకస్ చేస్తామన్నారు. వీటితోపాటు రైతు రుణమాఫీ అంశం, విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠ్యపుస్తకాలు, పాఠశాలల్లో సంస్కరణలు, హాస్టళ్లకు సన్నబియ్యం సరఫరా వంటి వాటిపైనా దృష్టి సారిస్తామన్నారు. పాలనలో భాగంగా ఆకస్మిక తనిఖీలు, పర్యటనలు కూడా ఉంటాయని చెప్పారు. రుణమాఫీకి సంబంధించి త్వరలోనే ఎస్ఎల్‌బీసీ సమావేశాన్ని ఏర్పాటు చేసి రైతులకు ఎంత మేరకు రుణాలు మిగతా.. 2లో

# కవిత కస్టడీ 20 వరకు పొడిగింపు



**న్యూఢిల్లీ, మే 14 (నమస్తే ఉదయం):** ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జ్యూడీషియల్ కస్టడీని ఈ నెల 20 వరకు పొడిగిస్తూ రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశాలు ఇచ్చింది. గతంలో విధించిన కస్టడీ గడువు మంగళవారం ముగియడంతో ఆమెను వర్చువల్ విధానంలో ప్రత్యేక కోర్టు ముందు హాజరుపరిచారు.

ఇరువైపులా వాదనలు విన్న జడ్జి కస్టడీని ఈ నెల 20 వరకు పొడిగించారు. కవితపై శుక్రవారం దాఖలు చేసిన అనుబంధ చార్జ్‌షీట్ అంశాన్ని ఈడీ న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. 8వేల పేజీలతో చార్జ్‌షీట్‌ను దాఖలు చేసినట్లు తెలిపారు. దీన్ని ఈ నెల 20న పరిశీలిస్తామని జడ్జి చెప్పారు.

# 66.30% పోలింగ్ శాతం తుది గణాంకాలు

- పోస్టల్ బ్యాలెట్ సహా లోక్ సభ ఎన్నికల్లో పోలింగ్
- ప్రత్యక్ష పోలింగ్ 65.67%.. భువనగిరి 76.78 టాప్
- 48.48 శాతంతో అట్టడుగున రాజధాని హైదరాబాద్
- మొత్తం ఓటింగ్‌లో పాల్గొన్నది 2,20,24,806 మంది
- అసెంబ్లీ స్థానాల ప్రకారం నర్సాపూర్ 84.25 ప్రథమం
- జూన్ 4న 34 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు: సీఈవో వికాస్‌రాజ్



**హైదరాబాద్, మే 14 (నమస్తే ఉదయం):** రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ శాతం తుది గణాంకాలు వెల్లడయ్యాయి. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ మంగళవారం ఈ వివరాలను వెల్లడించారు. 17 నియోజకవర్గాల్లో సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. ప్రత్యక్ష పోలింగ్ 65.67% నమోదైందని వికాస్‌రాజ్ తెలిపారు. గత లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే ఈసారి పోలింగ్ 3% పైగా పెరిగిందని, పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో కలిపి 66.3 శాతం దాటిందని వివరించారు. జూన్ 4వ తేదీన 34 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు చేపడతామన్నారు. కాగా, పోలింగ్‌లో భువనగిరి (76.78) ప్రథమ స్థానంలో నిలవగా, అత్యల్పంగా హైదరాబాద్‌లో 48.48% పోలింగ్ జరిగిందని పేర్కొన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా చూస్తే నర్సాపూర్‌లో అత్యధికంగా 84.25 శాతం, మలక్‌పేటలో అత్యల్పంగా 42.76 శాతం నమోదైందన్నారు. కాగా, రాష్ట్రంలో 3,32,16,348 మంది ఓటర్లకు గాను, 2,20,24,806 మంది ఓటు వేసినట్లు పేర్కొన్నారు.

ద 35,809 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 2,18,14,035 (65.67 శాతం) మంది, పోస్టల్ బ్యాలెట్‌లో 2,10,771 మంది హక్కు వినియోగించుకున్నారని వెల్లడించారు. పోలింగ్ శాతం పెంపునకు క్షేత్రస్థాయి యంత్రాంగం చేసిన కృషికి తగిన ఫలితం దక్కిందన్నారు. అన్ని పోలింగ్ స్టేషన్ల నుంచి ఈవీఎంలను భద్రతా బలగాల సహకారంతో స్ట్రాంగ్ రూముల్లో చేర్చినట్లు వికాసరాజ్ చెప్పారు. 44 స్ట్రాంగ్‌రూములకు నలువైపులా సీసీ కెమెరాలు, కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల వారీగా పోలింగ్ శాతం చూస్తే.. మిగతా.. 2లో



# వారాణసీ నుంచి నామినేషన్

- మోదీ ఆస్తి రూ.3.2 కోట్లు
- సొంత ఇల్లు, కారు లేవు.. ఎన్నికల అఫిడవిట్‌లో ప్రధాని వెల్లడి
- గంగా సప్తమి పర్వదినాన దాఖలు
- చంద్రబాబు, పవన్ సహా ఎన్డీయేకు చెందిన పలువురు నేతల హాజరు

**వారాణసీ, మే 14,(నమస్తే ఉదయం):** హిందువులు అత్యంత పవిత్రంగా భావించే గంగా సప్తమి పర్వదినాన.. ప్రధాని మోదీ వారాణసీ నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి నామినేషన్ వేశారు. మిగతా.. 2లో



# హైదరాబాద్‌కు తిరిగి ప్రయాణికుల రాక

- పంతంగి టోల్‌గేట్ వద్ద భారీగా రద్దీ
- ఎల్బీనగర్-మియాపూర్ మధ్య మెట్రోకు తాకిడి

**హైదరాబాద్,మే14(నమస్తే ఉదయం):** విజయవాడ -హైదరాబాద్ రహదారిపై మరోమారు వాహనాల రద్దీ కారణంగా ట్రాఫిక్ పెరిగింది. ఆంధ్రప్రదేశ్ లో జరిగిన ఎన్నికల్లో ఓటు వేసేందుకు హైదరాబాద్ సహా తెలంగాణ ప్రాంతాల నుంచి సొంతూళ్లకు వెళ్లిన వారు తిరుగు ప్రయాణమయ్యారు. సోమవారం సాయంత్రం నుంచే వాహనాల రాక మొదలయ్యింది. ఈక్రమంలో మంగళవారం ఉదయం నుంచి వాహనాల సంఖ్య భారీగా పెరిగింది. ఏపీలో ఓటింగ్ ముగియడంతో మిగతా.. 2లో

# ‘కడెం’పై సర్కారు దృష్టి

- ఐదు గేట్లకు శరవేగంగా మరమ్మతులు..
- నేడు ప్రాజెక్టు వద్దకు కీలక అధికారులు
- గత రెండేళ్లూ భారీ వరదలకు వణికిన ప్రాజెక్టు
- 2 గేట్ల రోప్‌లు తెగిపోవడం, మరో రెండింటి కౌంటర్ వెయిట్‌లు కొట్టుకుపోవడంతో సమస్య
- మొత్తం 18 గేట్లూ ఒకేసారి తెరుచుకోని వైనం
- డీఎస్ఆర్‌పీ సూచనపై దృష్టిపెట్టని గత సర్కారు
- యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని కొత్త ప్రభుత్వం నిర్ణయం.. ఉత్తర్వుల జారీ

**హైదరాబాద్, మే 14 (నమస్తే ఉదయం):** గోదావరి బేసిన్‌లో ఏటా వరదలతో నిండే ప్రాజెక్టుల్లో ఒకటైన కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టుపై ప్రభుత్వం దృష్టి సారించింది. గత రెండేళ్లూ భారీ వరదలతో ప్రాజెక్టు చిగురుటాకులా వణికిన విషయం విదితమే. స్పిల్‌వే (నీరు విడుదలయ్యే భాగం) సామర్థ్యం కన్నా అధికంగా వరద రావడంతో గత ఏడాది 18 గేట్లకు గాను 14 గేట్లు మాత్రమే పైకి లేచాయి. రెండు గేట్ల రోప్‌లు తెగిపోగా... మరో రెండు గేట్ల కౌంటర్‌వెయిట్‌లు కొట్టుకుపోయాయి. దాంతో వరద.. గేట్ల పైనుంచి కిందికి దూకింది. గత రెండేళ్ల అనుభవాల దృష్ట్యా ప్రాజెక్టు 18 గేట్లను ఏకకాలంలో ఎత్తడానికి వీలుగా 5 గేట్లలో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది.



ఇటీవలే వీటి మరమ్మతులకు ఉత్తర్వులు ఇవ్వగా ఎన్నికల సంఘం కూడా ప్రత్యేకంగా అనుమతి ఇచ్చింది. వానాకాలంలోపు ఈ మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా బుధవారం నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ (జనరల్) జి.అనిల్‌కుమార్ నేతృత్వంలోని అధికారుల బృందం మిగతా.. 2లో

# ప్రసంగాలతో జాగ్రత్త

- అగ్రనేతలకు ఇసి హెచ్చరిక

**న్యూఢిల్లీ,మే14(నమస్తే ఉదయం):** దేశంలో లోక్‌సభ ఎన్నికల సందడి కొనసాగుతోంది. మొత్తం ఏడు విడతల పోలింగ్‌లో ఇప్పటివరకు నాలుగు విడతలు ముగిశాయి. మరోవైపు.. ప్రచారంలో భాగంగా ప్రధాన పార్టీలు తమదైన




విమర్శనాస్త్రాలతో ప్రత్యర్థులపై విరుచుకుపడుతున్నాయి. ఈ క్రమంలోనే ప్రచార ఉపన్యాసాల విషయంలో అగ్ర నేతలకు ఎన్నికల సంఘం కీలక సూచనలు చేసింది. ఎన్నికల వేళ ఆయా పార్టీల అగ్ర నాయకుల నుంచి మంచి ప్రసంగాలను ఆశిస్తారని.. దీంతో వారు ఆమేరకు నడచుకోవాలని సూచించింది. మిగతా.. 2లో

# ఎన్నికల తర్వాత ప్రాంతీయ పార్టీలదే హవా

మొదటిపేజీ తరువాయి..

ఏం లేదు అని కేటీఆర్ స్పష్టం చేశారు. బీజేపీ పట్ల కూడా తెలంగాణ ప్రజలకు సానుకూలత లేదు. తెలంగాణ నుంచి నలుగురు ఎంపీలను గెలిపించినా ఏం అభివృద్ధి జరగలేదు. పెట్రోల్, డిజీల్, నిత్యావసర వస్తువుల ధరలు పిరం అయిన తర్వాత మోదీ మీద వ్యతిరేకత కనబడుతుంది. కాంగ్రెస్, బీజేపీ వైఫల్యాలను అర్థం చేసుకుని 17 నియోజకవర్గాల్లో బలమైన అభ్యర్థులను నిలబెట్టాం. 50 శాతం సీట్లను బీసీలకు కేటాయించి సామాజిక సమతూకాన్ని పాటించి, బలహీన వర్గాలకు బీఆర్ఎస్ పార్టీ న్యాయం చేసిందని కేటీఆర్ తెలిపారు. బలమైన సీనియర్ నాయకులను పోటీలో పెట్టాం. కాంగ్రెస్ పార్టీ మాత్రం చివరి నిమిషంలో వచ్చిన పారాచూట్ లీడర్లకు సీట్లు కేటాయించింది. బీజేపీ అభ్యర్థులు ఆరేడుగురు, కాంగ్రెస్‌లో నలుగురు అభ్యర్థులు మా పార్టీ నుంచి పోయిన వారే ఉన్నారు. దీంతో ఆ పార్టీ అభ్యర్థుల పట్ల విముఖత కనబడింది. మా అభ్యర్థుల పట్ల ప్రజల్లో సానుకూలత కనబడింది. ఇవాళ రెండు జాతీయ పార్టీలకు ముచ్చెటలు పట్టించే పరిస్థితి గులాబీ దండు తీసుకొచ్చింది. ఢిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ అన్నట్టు వ్యవహారం నడుస్తోంది. ఆరేడు సీట్లలో కాంగ్రెస్ పార్టీ బలహీనమైన నాయకులను పెట్టింది. కరీంనగర్, నిజామాబాద్, సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి ఇలా ఆరేడు సీట్లలో డమ్మీ అభ్యర్థులను పెట్టి బీజేపీని గెలిపించేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నించాడు. కిషన్ రెడ్డి కంటే ఎక్కువ రేవంత్ రెడ్డి కష్టపడ్డాడు అని కేటీఆర్ పేర్కొన్నారు.

ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం అహర్నిశలు కష్టపడ్డ గులాబీ సైనికులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ బస్సు యాత్రతో ఆదిలాబాద్ నుంచి అలంపూర్ దాకా గులాబీ సైన్యంలో గుండెల నిండా ఆత్మవిశ్వాసం కనబడుతోంది కేటీఆర్ స్పష్టం చేశారు. శాసనసభ ఎన్నికల్లో పరాభవం పాలైనప్పటికీ, రకరకాల కుట్రలు, కుతంత్రాలతో పార్టీలో నుంచి నాయకులు తీసుకోని పోయినప్పటికీ, గ్రామగ్రామనా, ప్రతి పట్టణంలో మొక్కవోని దీక్షతో గులాబీ సైనికులు పని చేశారు. ఒక వైపు క్షేత్ర స్థాయిలో నాయకులు, కార్యకర్తలు బలంగా పని చేశారు. మరోవైపు సోషల్ మీడియాలో ప్రత్యర్థుల దుష్ప్రచారాలు, విమర్శలను తిప్పికొడుతూ అద్భుతంగా పని చేసిన సోషల్ మీడియా వారియర్స్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు. ప్రభుత్వం కేసులు పెట్టే ప్రయత్నం చేసినా చురుకుగా పని చేసి బీఆర్ఎస్ పార్టీ గెలవాల్సిన అవశ్యకతను వివరించారు అని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం దాడులను, కేసులను, కుట్రలను, కుతంత్రాలను, స్వార్థపరుల రాజకీయ ఎత్తుగడలను తిప్పికొట్టారు. మొక్కవోని ధైర్యంతో ముందుకు పోయాం. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా చేపట్టిన కేసీఆర్ బస్సు యాత్ర రాష్ట్ర రాజకీయాలను ఒక మలుపు తిప్పింది. 17 రోజుల బస్సు యాత్రతో జాతీయ పార్టీల నాయకత్వాలు దిగివచ్చాయి. ఏ జిల్లాకు పోయినా, నియోజకవర్గం, పట్టణం పోయినా కేసీఆర్‌కు బ్రహ్మరథం పట్టారు. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ దాకా గులాబీ సైన్యంలో గుండెల నిండా ఆత్మవిశ్వాసం కనబడుతోంది. గులాబీ సైనికులు రెండు జాతీయ పార్టీలకు ముచ్చెటమలు పట్టించారు. కేసీఆర్ పోరు బాటకు జనం నుంచి వచ్చిన స్పందనతో కార్యకర్తల్లో ఉత్సాహం జోష్ వచ్చింది అని కేటీఆర్ తెలిపారు.

# ప్రసంగాలతో జాగ్రత్త

మొదటిపేజీ తరువాయి..

దేశ సామాజిక నిర్మాణాన్ని దెబ్బతీయకుండా ఉండేందుకుగాను తదుపరి ప్రచారంలో తమ ప్రసంగాలను సరిదిద్దుకోవాల్సిన బాధ్యత వారిపై ఉందని స్పష్టంచేసింది. మార్చి 16న సార్వత్రిక ఎన్నికల ప్రకటన వెలువడిన వెంటనే దేశవ్యాప్తంగా ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. ఈక్రమంలోనే ఎన్నికల కోడ్ అమలుపై ఈసీ తాజాగా తన రెండో నివేదికను విడుదల చేసింది. తమవద్ద నమోదైన 90 శాతానికిపైగా ఫిర్యాదులను పరిష్కరించినట్లు వెల్లడించింది. కాంగ్రెస్, భాజపాకు సంబంధించిన కొన్ని ఫిర్యాదులు మినహా ఆయా పార్టీల నుంచి వచ్చిన పెద్ద కేసులేవీ పెండింగ్‌లో లేవని తెలిపింది. 'దేశంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి దాదాపు రెండు నెలలు పూర్తయ్యింది. ఇప్పటివరకు జరిగిన ప్రచారం చాలావరకు హింసారహితంగా, ప్రలోభాలు, గందరగోళానికి తావులేకుండా సాగింది' అని పేర్కొంది. జూన్ 1న చివరి దశ పోలింగ్ ముగియనుండగా.. 4న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

## 66.30% పోలింగ్ శాతం తుది గణాంకాలు

మొదటిపేజీ తరువాయి..

ఆదిలాబాద్ 74.03, భువనగిరి 76.78, చేవెళ్ల 56.50, హైదరాబాద్ 48.48, కరీంనగర్ 72.54, ఖమ్మం 76.09, మహబూబాబాద్ 71.85, మహబూబ్‌నగర్ 72.43, మల్కాజిగిరి 50.78, మెదక్ 76.09, నాగర్‌కర్నూల్ 69.46, నల్లగొండ 74.02, నిజామాబాద్ 71.92, పెద్దపల్లి 67.87, సికింద్రాబాద్ 49.04, వరంగల్ 68.86, జహీరాబాద్ 74.63 శాతం పోలింగ్ నమోదైంది.

**భువనగిరిలోనూ మునుగోడు టాప్**

భువనగిరిలో గత ఎన్నికల కంటే 2.36 శాతం పోలింగ్ అధికంగా జరిగింది. ఈ లోక్‌సభ స్థానం పరిధిలో అత్యధికంగా మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గంలో 83.71 శాతం, ఇబ్రహీంపట్నంలో అత్యల్పంగా 66.83 శాతం ఓటింగ్ నమోదైంది. పట్టణ ప్రాంత ఓటర్లు అధికంగా ఉన్న ఇబ్రహీంపట్నం కంటే.. పల్లెలు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో పోలింగ్ బాగా జరిగింది.

# హైదరాబాద్‌కు తిరిగి ప్రయాణికుల రాక

మొదటిపేజీ తరువాయి..

ఓటర్లు తమ వాహనాలలో తెలంగాణకు తిరుగు ప్రయాణం కావడంతో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం నుంచి ఒక్కసారిగా రద్దీ పెరిగింది. ఓటు హక్కు వినియోగించుకుని ఏపీ నుంచి తిరిగివస్తున్న ఓటర్ల వాహనాలతో చౌటుప్పల్ పంతంగి టోల్ ఎలాజా వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఏపీతోపాటు కోదాడ, ఖమ్మం నుంచి అధిక సంఖ్యలో ఓటర్లు తిరిగివస్తున్న హైదరాబాద్ బాట పట్టారు. ఆఫీసులు, పనులు, వ్యాపారాలు ఉండటంతో సొంతూళ్లకు వెళ్లిన వారు ఒకేసారి తిరుగు ప్రయాణం కావడంతో విజయవాడ – హైదరాబాద్ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కాగా శనివారం, ఆదివారం హైదరాబాద్ నుంచి విజయవాడకు వాహనాలు క్యూ కట్టగా రహదారి కిక్కిరిసిపోయిన కిలోమీటర్ల మేర భారీ ట్రాఫిక్ జామ్ కావడం తెలిసిందే. తాజాగా సైతం అదే పరిస్థితి కనిపిస్తోంది. దాంతో పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాలు నెమ్మదిగా కదిలాయి. ఇదిలావుంటే హైదరాబాద్ మెట్రోకు కూడా తాకిడి పెరిగింది. హైదరాబాద్ మెట్రో రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు సొంతూళ్లకు వెళ్లిన వారు తిరిగిరావడంతో మెట్రోలో రద్దీ పెరిగింది. ప్రధానంగా ఎల్బీనగర్ నుంచి మియాపూర్ వైపు రైళ్లలో ఎక్కువ మంది ప్రయాణించారు. సాధారణంగా ప్రతి రోజూ ఉదయం 6 గంటలకు మెట్రో సేవలు ప్రారంభమవుతాయి. కానీ, మంగళవారం 5.30 నుంచే రాకపోకలు మొదలయ్యాయి. రద్దీ దృష్ట్యా మరిన్ని ట్రిప్పులు నడిపే అవకాశముంది. ఈ రూట్లో రైళ్లన్నీ క్రిక్కిరిసి పోయాయి.

## బీహార్ మాజీ డిప్యూటి సుశీల్ కుమార్ మోడీ మృతి

### క్యాన్సర్‌కు చికిత్స పొందుతూ తుదిశ్వాస

**న్యూఢిల్లీ,మే14 (నమస్తే ఉదయం):** బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి, రాజ్యసభ మాజీ ఎంపీ సుశీల్ కుమార్ మోదీ (72) కన్నుమూశారు. గత కొంతకాలంగా క్యాన్సర్‌తో పోరాడుతున్న ఆయన చికిత్స పొందుతూ న్యూఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో సోమవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని పార్టీ రాష్ట్ర యూనిట్ వెల్లడించింది. తనకు క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందని, ఈసారి లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేనని సుశీల్ కుమార్ మోదీ గత నెలలో ప్రకటించారు. ఆ ప్రకటన వచ్చి రోజులు గడవక ముందే సుశీల్ కుమార్ మోదీ మరణించడం ఆ పార్టీని కలచివేస్తోంది. సుశీల్ కుమార్ మోదీ బీహార్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారు. 2005 నుంచి 2013 వరకూ బిహార్ ఉప ముఖ్యమంత్రిగానూ.. 2017 నుంచి 2020 వరకూ బిహార్ ఆర్థిక మంత్రిగా ఉన్నారు. అలాగే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సభ్యుడు కూడా పని చేశారు. సుశీల్ కుమార్ మోదీ మరణంపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తీవ్ర సంతాపం ప్రకటించారు. సుశీల్ కుమార్ మోదీ తన జీవితాన్ని బీహార్‌కు అంకితం చేశారన్నారు. బిహార్‌ను జంగిల్ రాజ్ నుంచి బయటకు తీసుకొచ్చి అభివృద్ధి పథంలో నడిపించడంలో సుశీల్ మోదీ కృషి ఎంతో ఉపయోగపడిందని ట్విటర్‌లో పేర్కొన్నారు.

# 'కడెం'పై సర్కారు దృష్టి

మొదటిపేజీ తరువాయి..

కడెం ప్రాజెక్టును సందర్శించనుంది. గేట్ల మరమ్మతులపై అక్కడే సమీక్ష చేపట్టి, అవసరమైన ఆదేశాలు ఇవ్వనున్నారు. కాగా, ఈ ప్రాజెక్టుకు ఒక ప్రత్యేకత ఉంది. 18 గేట్లలో 9 జర్మనీ నుంచి తెప్పించుకున్నవి. మరో 9 మన దేశంలోనే తయారుచేసినవి. 1906లోనే నిజాం హయాంలో ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించి.. మధ్యలో ఆపేశారు. హైదరాబాద్ సంస్థానం పోలీసు చర్య అనంతరం ఇండియన్ యూనియన్‌లో విలీనం అయ్యాకా పూర్తి చేశారు. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో 1.30 లక్షల క్యూసెక్కుల వరద విడుదలయ్యేలా స్పిల్ వే డిజైన్ చేశారు. అయితే 1958 ఆగస్టు 31న ప్రాజెక్టుకు 3 లక్షల క్యూసెక్కుల వరద వ చ్చింది. దాంతో అంతకుముందు అమర్చిన జర్మనీ గేట్లకు అదనంగా మరో 9 గేట్లు పెట్టి, స్పిల్ వే సామర్థ్యం 3 లక్షల క్యూసెక్కులకు పెంచారు. రెండేళ్ల కిందట ప్రాజెక్టుకు ఏకంగా 5 లక్షల క్యూసెక్కుల వరద రాగా గత ఏడాది దాదాపు 4 లక్షల క్యూసెక్కుల దాకా వచ్చింది. జర్మనీ గేట్లు నిక్షేపంగా పనిచేస్తుండగా భారతదేశంలో తయారుచేసినవి నిరంతరం మొరాయిస్తున్నాయి. ఈ ప్రాజెక్టును డీఎసఆర్‌పీ తనిఖీ చేసి.. అదనంగా 5 గేట్లతో కొత్తగా ఒక స్పిల్ వే కట్టాలని నివేదిక ఇచ్చింది. ఏడాదిన్నర కిందటే డీఎసఆర్‌పీ నివేదిక ఇవ్వగా గత ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టలేదు.

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం వెనువెంటనే మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించి, ఇటీవలే నిధులు కూడా మంజూరు చే సింది. స్పిల్ వే కట్టాలంటే ఏడాది పాటు ప్రాజెక్టు కింద క్రాప్ హాలీడే ప్రకటించాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి తాత్కాలిక ప్రాతిపదికన గేట్లకు మరమ్మతులు చేసి, గేట్ల ఆపరేషనల్ మ్యానువల్‌లో మార్పులకు ఉపక్రమించారు. ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియా అంతా దట్టమైన అడవుల్లో ఉంది. దీంతో అడవుల్లో రెయిన్ గేజ్ స్టేషన్లు ఏర్పాటు చేసి, వాటిని ప్రాజెక్టు వద్ద ఉన్న స్కాడా కేంద్రానికి అనుసంధానం చేశారు. వరద సమాచారం అందుకోగానే గేట్లను ఏకకాలంలో తెరవనున్నారు. అడవుల్లో వర్షాలు కురిసిన తర్వాత ప్రాజెక్టుకు వరద చేరడానికి 9 గంటలు పడుతుందని అంచనా వేశారు. ఆ సమయానికి ముందే 18 గేట్లను ఎత్తేసి ప్రాజెక్టును ఖాళీ చేయాలని నిర్ణయించారు. దీని వల్ల రిజర్వాయర్‌పై ఒత్తిడి తగ్గి ప్రమాదం నుంచి కడెం ప్రాజెక్టు బయటపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

# రైతు సంక్షేమ కార్పొరేషన్

మొదటిపేజీ తరువాయి..

ఉన్నాయన్నది అంచనా వేస్తామన్నారు. రైతుల రుణాలను బ్యాంకుల నుంచి ప్రభుత్వం బదలాయించుకునేందుకు ఆర్‌బీఐ అంగీకరించబోదన్న మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలపై స్పందిస్తూ.. ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి లోబడి రుణం తీసుకుంటే ఆర్‌బీఐ ఎందుకు అంగీకరించదని ప్రశ్నించారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, ధరణి తదితరాలన్నింటిపైనా శాసనసభలో చర్చిస్తామని, సభలో చర్చకు పెట్టకుండా ఏదీ చేయబోమని స్పష్టం చేశారు. అఖిలపక్షాలు, స్టేక్ హోల్డర్లతోనూ చర్చిస్తామన్నారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు.. కేంద్ర బడ్జెట్ సమావేశాల తర్వాతే ఉంటాయని, కేంద్రం నుంచి వచ్చే నిధుల వెసులుబాటును చూసుకునే రాష్ట్ర బడ్జెట్ ఉంటుందని వెల్లడించారు. అందుకే రైతు రుణమాఫీకి ఆగస్టు 15 గడువు పెట్టుకున్నట్లు చెప్పారు.

**రేషన్ షాపుల ద్వారా పంటల పంపిణీ..**

రైతులు పండించే వరి, ఇతర పంటలను పౌరసరఫరాల సంస్థ ద్వారా గిట్టుబాటు ధర ఇచ్చి సేకరిస్తామని, వాటిని ఉత్పత్తుల కింద మార్చి రేషన్ షాపుల ద్వారా పేదలకు పంపిణీ చేస్తామని సీఎం తెలిపారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం.. రేషన్ షాపుల ద్వారా బియ్యంతోపాటు తొమ్మిది రకాల వస్తువులను సరఫరా చేసిందని గుర్తు చేశారు. రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ.. రైతులు ఆ వడ్లు పండించేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. సన్న వడ్లు పండించే రైతులకు క్వింటాలుకు మద్దతు ధరపై రూ.500 బోనస్ ఇచ్చి సేకరిస్తామని చెబుతామన్నారు. అప్పుడు రైతులు కూడా సన్న వడ్లు పండించేందుకు ముందుకొస్తారని తెలిపారు. రేషన్ కార్డుల మంజూరు అనేది నిరంతర ప్రక్రియ అని సీఎం రేవంత్ అన్నారు. వీటితోపాటు అన్ని కార్యక్రమాలకు సంబంధించి గ్రామసభల్లో తీసుకున్న దరఖాస్తులను కంప్యూటరైజ్ చేసినట్లు చెప్పారు. రిటైర్ అయి కూడా వివిధ శాఖల్లో కొనసాగుతున్న అధికారులు వెయ్యి మందికి పైగా ఉన్నారని వెల్లడించారు. మంత్రివర్గ సమావేశం నిర్వహించి వారి విషయంలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. కర్ణాటకలో కరువు పరిస్థితులున్నా.. వారిని ఒప్పించి రాష్ట్రంలో తాగునీటి అవసరాల కోసం రెండున్నర టీఎంసీల కృష్ణా నీటిని ఆ రాష్ట్రం నుంచి తెచ్చామని గుర్తు చేశారు. 59 జీవోను అబయన్స్‌లో పెట్టామని, ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత సమీక్షిస్తామని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ సంబంధిత అంశాలను అసెంబ్లీకే చెబుతామన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే వర్సిటీలకు కొత్త వీసీలను నియమిస్తామని చెప్పారు. కరెంటు విషయంలో హరీశ్‌రావు ఒక మెకానిజం ఏర్పాటు చేసి.. ఎన్నికల్లో ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలని చూశారని ఆరోపించారు. ఇందుకు సంబంధించి కొన్ని కేసులను గుర్తించి నమోదు చేశామన్నారు.

**పదేళ్లు రాష్ట్రంలోనే..**

రానున్న పదేళ్లూ తాను తెలంగాణ రాజకీయాల్లోనే ఉంటానని సీఎం రేవంత్ అన్నారు. రానున్న వందేళ్ల అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసి ప్రజలకు అందించడం తన బాధ్యత అని పేర్కొన్నారు. ఏపీలో ఎవరు ముఖ్యమంత్రి అయినా వారితో సత్సంబంధాలు పెట్టుకుంటామని, రెండు రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించుకుంటామని స్పష్టం చేశారు. ఇక మూసీ నదిని రాష్ట్రానికి ఆదాయాన్నందించే వనరుగా మారుస్తామని, కన్సల్టెన్సీ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కేసీఆర్ మాదిరిగా తాను మేధావిని కాకపోవడం వల్లనే కన్సల్టెన్సీ నివేదికలపై ఆధారపడుతున్నానని రేవంత్ ఎద్దేవా చేశారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వల్ల మెట్రోను అమ్ముకునే పరిస్థితి వస్తుందన్న యాజమాన్యం వ్యాఖ్యలపై సీఎం స్పందిస్తూ, "వాళ్ల ఆస్తిని వాళ్లు అమ్ముకుంటానంటే ఎవరు వద్దన్నారు?" అని ప్రశ్నించారు. హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతం చేస్తారని ఎవరైనా అంటే అంత తెలివిలేనివాడు ఇంకొకడు ఉండడన్నారు. యూటీ అనేది స్టాప్ గ్యాప్ మాత్రమేనని, అది విఫల ప్రయోగం అని కూడా అన్నారు. నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు.

**ఆరేడు సీట్లలో బీఆర్ఎసకు డిపాజిట్ రాదు..**

రాష్ట్రంలోని 17 లోక్‌సభ సీట్లకుగాను ఆరేడు సీట్లలో బీఆర్ఎసకు డిపాజిట్ కూడా రాదని సీఎం రేవంత్ అన్నారు. మెదక్‌లో మాత్రమే ఆ పార్టీ గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉందన్నారు. కాంగ్రెసకు 13 సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీని తమకు ప్రత్యర్థిగా బీఆర్ఎస్ బలవంతంగా సృష్టించిందని ఆరోపించారు. దేశంలో, రాష్ట్రంలోనూ మోదీ వేవ్ లేదని, బీఆర్ఎస్ ఆ పార్టీ యంత్రాంగం మొత్తాన్ని బీజేపీకి అప్పగించిందని అన్నారు.

రాజకీయాల్లో హత్యలు ఉండవని, ఆత్మహత్యలే ఉంటాయని వ్యాఖ్యానించారు. దేశ వ్యాప్తంగా ఎన్డీయేకు పది శాతం అటు ఇటుగా 220 సీట్లు వస్తాయని తెలిపారు. కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలో తమ అభ్యర్థి 20 వేల మెజారిటీతో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. అక్కడ మాత్రం బీఆర్ఎస్ పోటీ ఇస్తుందని అన్నారు. రాష్ట్ర ఆర్థికస్థితిపై శ్వేతపత్రాన్ని ప్రకటించడాన్ని కేసీఆర్ తప్పుబట్టడంపై స్పందిస్తూ ఆయన చేసిన పాపాలన్నింటినీ మూసిపెట్టాలనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. రైతుబంధు కూడా పూర్తి చేయలేమంటూ మాట్లాడారని, చేశాక అది వాళ్ల గొప్పదనమంటున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రెండోసారి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అది కూడా వాళ్ల గొప్పతనమే అని చెప్పుకోవచ్చన్నారు.

# వారాణసీ నుంచి నామినేషన్

మొదటిపేజీ తరువాయి..

అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్ సహా పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్ సహా పలువురు ఎన్డీయే కూటమి నేతలు తదితర అతిరథమహారథులు వెంటరాగా.. మంగళవారం ఉదయం ఆయన జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను సమర్పించారు.

సార్వత్రిక ఎన్నికల ఆఖరి దశలో (జూన్ 1న) పోలింగ్ జరిగే నియోజకవర్గాల్లో వారాణసీ ఉంది. నామినేషన్ల దాఖలుకు ఆఖరు రోజు మంగళవారమే. గంగాదేవి భూమికి దిగివచ్చిన గంగా సప్తమి, పుష్యమి నక్షత్రం కలిసి రావడంతో.. మోదీ ఈరోజును ఎంచుకున్నారు. నామినేషన్ వేయడానికి ముందు ఆయన దశాశ్వమేధ ఘాట్‌లో గంగా స్నానం చేశారు.

అక్కడ జరిగిన హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కాశీ క్షేత్రపాలకుడైన కాలభైరవుడి గుడికి వెళ్లి స్వామి దర్శనం చేసుకుని ప్రార్థనలు చేశారు. "కాశీతో నా అనుబంధం అద్భుతమైనది, విడదీయలేనిది, పోలిక లేనిది. మాటల్లో చెప్పలేనిది. మీ అందరి ఆప్యాయతతో పదేళ్లు ఎలా గడిచిపోయాయో కూడా గుర్తురావట్లేదు. ఈరోజు గంగమ్మ తల్లి నన్ను తన దత్తత తీసుకుంది" అని 'ఎక్స్'లో ట్వీట్ చేశారు.

నామినేషన్ అనంతరం నేరుగా.. కాశీలోని రుద్రాక్ష కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుని స్థానిక పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. పార్టీ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని వారికి దిశానిర్దేశం చేశారు.

ప్రతి బూత్‌లోనూ.. గతంలో పోలైన ఓట్ల కంటే 370 ఓట్లు అధికంగా పోలయ్యేలా చూడాలని సూచించారు. ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో ఆయన ఈ సూచన చేసినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. నామినేషన్ దాఖలు చేసిన తర్వాత ప్రధాని మోదీ 'ఎక్స్'లో ఒక పోస్టు పెట్టారు. "ఈ చారిత్రక నియోజకవర్గం (వారాణసీ) నుంచి పోటీ చేసి గెలిచి ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం నాకు దక్కిన గౌరవం" అని పేర్కొన్నారు. కాశీ ప్రజలను తన కుటుంబసభ్యులుగా అభివర్ణించారు. "ప్రజల మద్దతుతో మూడోసారి కూడా గెలిచి.. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ఇనుమడించిన ఉత్సాహంతో కృషి చేస్తా. 'జై బాబా విశ్వనాథ్'" అని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

**ఆ నలుగురూ..**

2014, 2019 తరహాలోనే.. ఈసారి కూడా మోదీ నామినేషన్ వేయడానికి వేర్వేరు వర్గాలకు చెందిన నలుగురు ప్రపోజర్లను(లోక్‌సభ అభ్యర్థిగా బలపర్చేవారు) ఎంచుకున్నారు. ఆ నలుగురూ.. పండిత్ గణేశ్వర్ శాస్త్రి, బైజ్‌నాథ్ పటేల్, లాల్‌చంద్ కుశ్వాహ, సంజయ్ సోంకర్. వీరిలో పండిత్ గణేశ్వర్ శాస్త్రి ప్రముఖ జ్యోతిష్కుడు, వేదపండితుడు, న్యాయశాస్త్ర కోవిదుడు. అయోధ్య రామ మందిర శంకుస్థాపనకు, బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి ముహూర్తం పెట్టింది ఆయనే.

2022 ఫిబ్రవరిలో కాశీ విశ్వనాథ్ కారిడార్ నిర్మాణానికి కూడా ముహూర్తం పెట్టింది ఈయనే. గణేశ్వర్ శాస్త్రి తాతముత్తాతలు.. తమిళనాడులోని తిరువసనల్లూరు నుంచి ఎప్పుడో వారాణసీకి వచ్చి స్థిరపడ్డారు. మరో ప్రపోజర్.. వారాణసీ లోక్‌సభ నియోజకవర్గంలోని సేవాపురి ప్రాంతానికి చెందిన బైజ్‌నాథ్ పటేల్ ఆరెస్సెస్ కార్యకర్త. జనసంఘతో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన వ్యక్తి.

ఇంకో ప్రపోజర్ లాల్‌చంద్ కుశ్వాహ(65).. ఓబీసీ వర్గానికి చెందిన వ్యక్తి. బీజేపీ వారాణసీ జోనల్ ఇన్‌చార్జ్. మరో ప్రపోజర్.. సంజయ్ సోంకర్ (50) దళితుడు. వారాణసీ జిల్లా విభాగం జనరల్ సెక్రటరీగా వ్యవహరిస్తున్నారు.

**కాంగ్రెస్‌కు ఒక్క సీటూ రాదు**

తనకు మొత్తం రూ.3.02 కోట్ల విలువ చేసే ఆస్తులు ఉన్నాయని మోదీ ప్రకటించారు. మంగళవారం నామినేషన్ దాఖలు చేసిన ఆయన.. పోల్ అఫిడవిట్‌లో తన ఆస్తులు, అప్పులు, చేతిలో ఉన్న డబ్బు వివరాలను వెల్లడించారు. ఆ అఫిడవిట్ ప్రకారం.. మోదీకి కారు లేదు. సొంత ఇల్లు లేదు. భూములుగానీ, షేర్లుగానీ లేవు. మ్యూచువల్ ఫండ్స్‌లో ఎలాంటి పెట్టుబడులూ లేవు.

ఎస్‌బీఐలో ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో మాత్రం రూ.2.86 కోట్లున్నాయి. రూ.2.68 లక్షల విలువ చేసే నాలుగు బంగారు ఉంగరాలు, రూ.9.12 లక్షల విలువైన జాతీయ పొదుపు పత్రాలు ఆయన పెట్టుబడులు. ఇక, ఆయన చేతిలో ఉన్న నగదు.. 52,920 రూపాయలు. వారాణసీ, గాంధీనగర్‌లోని రెండు బ్యాంకు ఖాతాల్లో 80,304 రూపాయలు ఉన్నాయి.

ప్రభుత్వం నుంచి తీసుకుంటున్న జీతాన్ని, బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వస్తున్న వడ్డీని తన ఆదాయ వనరులుగా చూపారు. 2018-19లో తన ఆదాయం రూ.11.14 లక్షలుగా చూపిన మోదీ.. 2022-23లో రూ.23.54 లక్షలుగా పేర్కొన్నారు. 2014లో మోదీ తన ఆస్తుల విలువను రూ.1.66 కోట్లు, 2019లో రూ.2.51 కోట్లుగా పేర్కొన్న సంగతి తెలిసిందే. కాగా, ఈ లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాదని మోదీ అన్నారు. వారాణసీ నియోజకవర్గం బీజేపీకి కంచుకోట! ఇక్కడ హిందూ జనాభా 75 శాతం కాగా.. ముస్లింలు 20 శాతం దాకా ఉన్నారు. హిందువుల్లో.. 10శాతం ఎస్టీలు, 0.7 శాతం ఎస్సీలు ఉన్నారు. గ్రామీణ ఓటర్లు 65 శాతం.. అర్బన్ ఓటర్లు 35 శాతం. ఒక్క 2004 ఎన్నికల్లో మినహా.. 1991 నుంచి ఇప్పటిదాకా ఆ నియోజకవర్గాన్ని బీజేపీనే దక్కించుకుంది. 2004 ఎన్నికల్లో.. కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఆర్కే మిశ్రా అక్కడ విజయం సాధించారు. ఇక, మోదీ 2014లో 3.71 లక్షల ఓట్ల ఆధిక్యంతో (56.37 శాతం ఓట్లు).. 2019లో 4.79 లక్షల ఓట్ల ఆధిక్యంతో (63 శాతం ఓట్లతో) అద్భుత విజయాలు సాధించారు. ఇప్పుడు ముచ్చటగా మూడోసారి పాత రికార్డులను ఛేదించడమే లక్ష్యంగా బరిలోకి దిగారు. ఈసారి ఆయనకు పోటీగా కాంగ్రెస్ పార్టీ ఆ రాష్ట్ర పీసీసీ చీఫ్ అజయ్ రాయ్‌ని వరుసగా మూడోసారి రంగంలోకి దించింది.

# ఇప్పటికే 270 సీట్లు గెలిచేసాం

### 400 సీట్లు లక్ష్యం కోసం పోరాడుతున్నాం

### బెంగాల్ ప్రచారంలో అమిత్ షా వెల్లడి

**న్యూఢిల్లీ,మే14 (నమస్తే ఉదయం):** లోక్‌సభ ఎన్నికల్లో మోదీ ఇప్పటికే 270 సీట్లు గెలిచినట్టు తాను చెప్పగలనని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. నాలుగు దశల్లో అవసరమైన సీట్లు గెలిబోతున్నామని అన్నారు. 400కు పైగా సీట్లలో గెలుపు సాధించడమే లక్ష్యంగా ఈ ఎన్నికల్లో తాము పోరాడుతున్నామని పశ్చిమబెంగాల్లోని బాంగావ్‌లో మంగళవారం నాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ చెప్పారు. ఇంతవరకూ నాలుగు విడతల పోలింగ్ పూర్తయింది. 380 సీట్లకు ఎన్నికలు జరిగాయి. బెంగాల్‌లో కూడా 18 సీట్లకు ఎన్నికలు పూర్తయ్యాయి. 380 సీట్లలో ప్రధాని మోదీ 270 సీట్లు



గెలుచుకోవడం ద్వారా సంపూర్ణ మెజారిటీని సాధించారని నేను కచ్చితంగా చెప్పగలను. 400కు పైగా సీట్లు గెలుచుకోవడమే మా లక్ష్యం అని అమిత్‌షా అన్నారు. సీఏఏపై మమతా బెనర్జీ అపోహలు వ్యాప్తి చేస్తున్నారని, ఈ చట్టం కింద మతువా తెగల వారు పౌరసత్వం పొందుతారని ఆయన హామీ ఇచ్చారు. సీఏఏ కేంద్ర ప్రభుత్వ చట్టమైనందున దానిని అమలు కాకుండా మమతా బెనర్జీ ఎంతమాత్రం అడ్డుకోలేరని స్పష్టం చేశారు. శరణార్థులైన సోదరులకు దేశ పౌరసత్వం లభించకుండా ఈ ప్రపంచంలో ఏ శక్తీ ఆపలేదన్నారు. ఇది మోదీ ఇచ్చిన వాగ్దానమని గుర్తుచేశారు. పౌరసత్వం అనేది కేంద్ర ప్రభుత్వానికి ఉన్న విశిష్ఠ అధికారమే కానీ, రాష్ట్ర ప్రభుత్వాలది కాదనే విషయం మమతా బెనర్జీ గుర్తుంచుకోవాలన్నారు.

# ఎవరి అంచనాలు వారివే!

### కూడికలు.. తీసివేతల్లో పార్టీల మథనం

### అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా లెక్కలు

### అధికార పార్టీల ముఖ్య నేతల్లో టెన్షన్

### మరో 20 రోజులపాటు అదే ఉత్కంఠ



**హైదరాబాద్, మే 14 (నమస్తే ఉదయం):** రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఘట్టం ముగియడంతో రాజకీయ పార్టీలు తమకు ఎన్ని సీట్లు, ఎన్ని ఓట్లు వస్తాయనే అంచనాల్లో తలమునకలయ్యాయి. రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య త్రిముఖ పోటీ నెలకొన్న నేపథ్యంలో ఓటరు నాడిని పట్టుకోవడం కొంచెం కష్టంగానే ఉన్నప్పటికీ, వివిధ పార్టీల అభ్యర్థులు, అధినాయకత్వాలు పోలింగ్ ట్రెండ్‌పై క్షేత్రస్థాయి నుంచి సమాచారం తెప్పించుకొని లెక్కలేసుకుంటున్నా యి. మంగళవారం ఉదయం నుంచి పార్టీల ముఖ్య నేతలు పోలింగ్ శాతాన్ని పరిగణనలోకి తీసుకొని, ఒక్కొక్క పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలు, వాటిలో ఇటీవలి ఎన్నికల్లో పార్టీకి వచ్చిన ఓటు షేర్, ప్రస్తుత పోలింగ్ ట్రెండ్ ఆధారంగా అంచనాలు వేసుకుంటున్నారు. ఆ యా నియోజకవర్గాల్లో అభ్యర్థి, పార్టీ ప్రచారం ఎలా సాగింది? ఓటర్లను ఏయే అంశాలు ప్రభావితం చేశాయి? తదితర అంశాల ప్రాతిపదికగా ప్రస్తుతం ఎన్ని ఓట్లు వచ్చాయి? అవతలి పార్టీ అభ్యర్థికి వచ్చిన ఓట్లు ఎన్ని? అని లెక్కలేసుకుంటున్నారు.

**అధికార పార్టీలకు టెన్షన్**

రాష్ట్రంలో తలపడిన మూడు ప్రధాన పార్టీల్లో అధికార పార్టీ నేతలకు ఫలితాలపై టెన్షన్ అధికంగా ఉండటం సహజం. ఫలితాల్లో తేడా వస్తే తమ పదవులకే ఎసరు వస్తుందన్న దిగులు అధికార పార్టీ నేతలను వెంటాడుతున్నది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతోపాటు కేంద్రంలో మరోసారి అధికారంలోకి రావాలన్న పట్టుదలతో ఉన్న బీజేపీ ఈసారి తెలంగాణ మీద ప్రత్యేక దృష్టి సారించింది. దీంతో ఆ రెండు పార్టీల జాతీయ నాయకత్వాలు సైతం టెన్షన్ పడుతున్నాయి. ఐదు నెలల క్రితం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని ప్రజాక్షేత్రంలో బీఆర్ఎస్ తొడగొట్టి సవాల్ చేసింది. 'ఇటీవలే మనం అధికారంలోకి వచ్చాం. కేంద్రంలో కూడా అధికారంలోకి రావాలంటే మీరు బాగా పనిచేయాలి. మీ పనితనానికి ఫలితాలే కొలమానం' అని కాంగ్రెస్ హైకమాండ్ మంత్రులతోపాటు ముఖ్యమంత్రికి కూడా టార్గెట్ ఇచ్చింది. నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోకపోతే ఆఖరికి మంత్రి పదవులు కూడా పోతాయి అనే రీతిలో అధిష్ఠానం ఇద్దరు, ముగ్గురు మంత్రులను సున్నితంగా హెచ్చరించినట్టు ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో మంత్రులు ఎవరికివారు తమతమ జిల్లాలు, తమ సొంత నియోజకవర్గాల్లో సర్వశక్తులు ఒడ్డారు. మరోవైపు మూడోసారి పీఠం ఎక్కడమే పరమావధిగా ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షాతోపాటు బీజేపీలోని సమస్త పటాలం సర్వశక్తులు ఒడ్డింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన తరువాత కొది నెలలకే వచ్చిపడ్డ పార్లమెంట్ ఎన్నికల్లో క్యాడర్‌లో నిరాశ, నిస్పృహలను తొలగించి పార్టీకి భవిష్యత్తు ఉన్నదని నిరూపించేందుకు బీఆర్ఎస్ పార్టీ సైతం సర్వం ధారపోసింది. పార్టీ అధినేత కేసీఆర్ సహా పార్టీ నాయకత్వం మొత్తం తమ శక్తిని వినియోగించింది. మూడు పార్టీలు హోరాహోరీగా తలపడటంతో క్రాస్ ఓటింగ్, సైలెంట్ ఓటింగ్ ఎటువంటి ఫలితాన్ని ఇస్తుందనే ఉత్కంఠ సర్వత్రా నెలకొన్నది. మరో 20 రోజులు ఓపికపడితే కానీ రాష్ట్రంలో రాజకీయ ముఖచిత్రం ఎట్లా ఉంటుందో చెప్పలేమం టూ రాజకీయ విశ్లేషకులు సైతం ఫలితాలపై అంచనాలకు రాలేకపోతుండటం గమనార్హం.



## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో నిలిచిన ఇండిగో విమానం...

**శంషాబాద్,మే14((నమస్తే ఉదయం):**
శంషాబాద్ విమానాశ్రయంలో ఇండిగో విమానం నిలిచిపోయింది.మంగళవారం ఇండిగో 6ఏ 6707 విమానం హైదరాబాద్ నుంచి కొచ్చిన్‌కు వెళ్లాల్సి ఉంది.అయితే సరిగ్గా టేకాఫ్ సమయంలో ఇండిగో విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది.దీంతో విమానం రన్‌వేపై నిలిచిపోయింది. దాదాపు గంట నుంచి టేకాఫ్ కాకుండా విమానం రన్‌వేపై నిలిచి పోయవడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.అయితే ఇండిగో విమానంలో రెవిన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, కాంగ్రెసు పార్టీ నేతలు ఉన్నారు.గంట గడిచినప్పటికీ విమానం టేకాఫ్ అవకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం విమానంలో సాంకేతికలోపాన్ని సరిచేసే పనిలో ఎయిర్‌పోర్ట్ సిబ్బంది ఉన్నారు.

## నిరుద్యోగుల మహిళలకు శుభవార్త..

**ఉచిత టైలరింగ్ బ్యూటీషియన్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం..**

**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాదర్**

**రాజేంద్రనగర్,మే14 (నమస్తే ఉదయం):**
నిరుద్యోగ యువత, విద్యార్థులు, గృహిణిలకు అండగా నిలవాలని ఉద్దేశంతో టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సులకు సంబంధించి ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాదర్ తెలిపారు.మంగళవారం మైలార్ దేవులపల్లి లో విలేకరుల సమావేశం నిర్వహించి కోర్సుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు.ఈ సందర్భంగా మహమ్మద్ ఖాదర్ మాట్లాడుతూ... 45 రోజుల పాటు



శిక్షణ తరగతులు ఉంటాయని చెప్పారు.రిజిస్ట్రేషన్ ఫీజు 200 రూపాయలుగా తెలిపారు.విద్యార్థులు,నిరుద్యోగ యువత, గృహిణిలకు ఉపయుక్తంగా ఉండే ఈ కోర్సుల్లో చేరేందుకు కనీసం పదో తరగతి పాసైనవారు అర్హులని,ఎటువంటి వయోపరిమితి లేదని వివరించారు.ఆసక్తి ఉన్నవారు ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని,సీట్లు పరిమితంగా ఉన్నందున 'ముందు వచ్చినవారికి ముందు' ప్రాతిపదికన కేటాయిస్తామని స్పష్టం చేశారు.వృత్తి శిక్షణ తరగతులను మైలార్ దేవ్ పల్లి లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.ఇతర వివరాలకు 8885128982 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## కాంగ్రెస్ పార్టీ కోసం పార్లమెంట్ ఎన్నికలలో కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు...

**కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్...**

**కూకట్‌పల్లి,మే 14 (నమస్తే ఉదయం):**
ఏలాంటి ప్రతిఫలం ఆశించకుండా పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారందరికీ కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ బండి రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. మల్కాజ్గిరి పార్లమెంట్, కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల అనంతరం బాలానగర్ పార్టీ కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గ ఇంచార్జి బండి రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అయన మాట్లాడుతూ ముఖ్యంగా పార్లమెంట్ ఎన్నికలలో కష్టపడ్డ పార్టీ అభిమానులకు, నాయకులకు, కార్యకర్తలకు ప్రతిఒక్కరికి కృత్జత, అభినందనలు తెలిపారు. అన్ని సర్వేలు, రిపోర్టులు మల్కాజ్గిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డి లక్ష ఓట్ల మెజారిటీతొ గెలవడం ఖాయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, వేణు,



నియోజకవర్గం సీనియర్ నాయకులు శేరి సతీష్ రెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వర రావు , గాలి బాలాజీ, రఘు, సాదు ప్రతాప్ రెడ్డి, బషీర్ భాయ్ ,టోచర్, గోపాల్ చౌదరి పిడికిడి, మోహన్ రెడ్డి, బాకీ భాయ్ , రాజేందర్ డివిజన్ అధ్యక్షులు మేకల రమేష్, మధు, కృష్ణ రాజపుట్, కె. రమేష్, ప్రవీణ్,మహిళా నాయకురాలు పుష్పారెడ్డి, రమాదేవి, రేష్మా, జ్యోతి, రజిత ,కృష్ణవేణి, జోజమ్మ, భరతమ్మ, రాధా, మారుతి, విజయలక్ష్మి, రేణుక, స్వరూప, బండి సుధా పాల్గొన్నారు.

## ఎన్నికల పరిశీలకులు, ఏజెంట్ల సమక్షంలో
# స్ట్రాంగ్ రూమ్‌లకు బ్యాలెట్ బాక్సులు

**కంటైనర్‌కు సీలు వేస్తున్న అధికారులు**

**రాజేంద్రనగర్, మే 14 (నమస్తే ఉదయం):**
చేవెళ్ల పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఈనెల 13వ తేదీ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఓటర్లు ఎంతో ఉత్సాహంగా ఓటు హక్కు వినియోగించుకొని తమ బాధ్యతను నెరవేర్చారు.ఎన్నికల బరిలో నిలిచిన 43 మంది అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో భద్రంగా నిక్షిప్తమయ్యాయి.ఓటరు తీర్పు ఎటు వైపు ఉందో జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపులో తేలనుంది.

అప్పటివరకు అన్ని పార్టీల నాయకుల్లో ఉత్కంఠ తప్పని పరిస్థితి నెలకొన్నది.పోలింగ్ ముగియగానే ఈవీఎంలను భారీ బందోబస్తు మధ్య రాజేంద్రనగర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ హార్స్ రేస్ కోర్ట్ క్రీడా ప్రాంగణంలోకి తీసుకువచ్చారు.అనంతరం ఎన్నికల ఏజెంట్లు,అధికారుల సమక్షంలో మంగళవారం తెల్లవారుజామున బ్యాలెట్ బాక్సులకు సీలు చేశారు.

జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక పర్యవేక్షణలో రాజేంద్రనగర్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వెంకట్ రెడ్డి సమక్షంలో అన్ని బ్యాలెట్ లను మూడు ట్రక్కులలో లెక్కింపు కేంద్రమైన చేవెళ్లలోని బండారి శ్రీనివాస్ ఇంజనీరింగ్ కాలేజ్ కి కట్టుదిట్టమైన

పోలీస్ బలగాల మధ్య తరలించి..స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు.లెక్కింపు కేంద్రాల్లోనే స్ట్రాంగ్ రూములు ఉండేలా చర్యలు తీసుకున్నారు.ప్రతి స్ట్రాంగ్ రూమ్ వద్దమూడంచాల సాయుధ పోలీసు బలగాలతో భద్రతా చర్యలు చేపట్టారు.



ఈవీఎంలను తరలిస్తున్న కంటైనర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో వెంకట్ రెడ్డి



# రాష్ట్రంలో పన్నెండు పార్లమెంటు స్థానాలు బిజేపివే

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షులు బాబయ్య**

**షాద్ నగర్లో బిజెపికి భారీ మెజారిటీ**

**అందరి కృషితో గెలవబోతున్నాం.**

**పార్టీలకు అతీతంగా ఓట్లు సాధించాం**

**అరుణమ్మను ఆదరించినందుకు కృతజ్ఞతలు.**

**షాద్ నగర్,మే14(నమస్తే ఉదయం):**
దేశం కోసం ధర్మం కోసం ప్రతి ఒక్కరూ అన్ని వర్గాలు ముందుకు వచ్చి బిజెపికి మద్దతుగా నిలిచారని, మరోసారి దేశంలో మోడీ మ్యానియానే బిజెపిని గెలిపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,షాద్ నగర్ సీనియర్ నేతలు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి,అందె బాబయ్య,కమ్మరి భూపాల చారి తదితరులు.మంగళవారం ఏబి కాంప్లెక్స్ లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ...రాష్ట్రంలో పన్నెండు పార్లమెంటు స్థానాలు బిజేపివే అని అన్నారు.షాద్ నగర్లో బిజెపికి భారీ మెజారిటీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.అటు దేశంలో గానీ ఇటు తెలంగాణలో గానీ కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మ లేదని తెలిపారు. అందరి కృషితో బిజెపి మరోసారి ముచ్చటగా మూడోసారి రాబోతుందని అన్నారు.పార్టీలకు అతీతంగా బీఆర్ఎస్,కాంగ్రెస్ కార్యకర్తలు, మద్దతుదారులు, అభిమానులు కూడా చాలామంది మోడీ నాయకత్వాన్ని బలపరిచారని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.ముఖ్యంగా రాష్ట్రంలో కొన్ని సర్వేల ప్రకారం 12 పార్లమెంటు స్థానాలు భారతీయ జనతా పార్టీ కైవసం చేసుకోబోతుందని అన్నారు.ఎన్నికల సందర్భంగా కర్షకులు కార్మికులు రైతులు మహిళలు విద్యార్థులు యువత అన్ని వర్గాలు మోడీ నాయకత్వాన్ని బలపరిచారని అన్నారు. మూడు అంచెల్లో పకడ్బందీగా ప్రచారం నిర్వహించిన బిజెపి ఎన్నికల్లో సక్సెస్ దిశగా ఓట్లు రాబట్టిందని అన్నారు.ముఖ్యంగా ఆ శ్రీరాముడి చల్లని ఆశీస్సులతోనే డీకే అరుణ గెలుపు ఖాయం అయిందని,దాదాపు లక్ష మెజార్టీతో గెలుపొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

400 ఎంపి సీట్ల పిలుపుతో భారత ప్రధాని మోడీ మరోసారి ప్రధానమంత్రి కాబోతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. మహబూబ్ నగర్ పార్లమెంటులో పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలు ఏకతాటిపైకి వచ్చి బిజెపి అభ్యర్థి డీకే అరుణకు భారీగా ఓట్లు వేయడం ఎంతో శుభ పరిణామమని,ఎన్నికల్లో డీకే అరుణ కచ్చితంగా గెలిచి తీరుతారని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు స్పష్టం చేశారు.నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఎక్కడ చూసినా మోడీ చరిష్మా, డీకే అరుణ ప్రభావం స్పష్టంగా కనిపించిందని అన్నారు.గత అసెంబ్లీ ఎన్నికలను పోల్చితే 100 రెట్లు బిజెపి ఓట్ల శాతం పెరగడం కార్యకర్తలను సంతోషాన్ని గురిచేస్తుందని అన్నారు. ఇది సమిష్టి కృషి అని,కార్యకర్తలు రాత్రింబవళ్లు కష్టపడి పని చేశారని అన్నారు. బీఆర్ఎస్ పూర్తిగా అస్తిత్వాన్ని కోల్పోయిందన్నారు. స్వచ్ఛందంగా బిజెపిని ప్రజలు ఆదరించారని అన్నారు.


మరోవైపు కాంగ్రెస్ పార్టీ ఓటుకు నోటు పంచిందని మద్యం ఏరులై పారిందని అయినా ప్రజలు ఎక్కడ వారి మనస్సు చెదరకుండా బిజెపికి ఓట్లు వేశారంటే మోడీ,డీకే అరుణ చరిష్మా ఎంతో గొప్పదని అన్నారు.దక్షిణ తెలంగాణలో మహబూబ్ నగర్,చేవెళ్లకు సాటిలేదని అన్నారు.బిజెపి గెలిస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారు అంటూ ప్రజల మధ్య మతవిద్వేషాలను రెచ్చగొట్టేలా,అసత్య ఆరోపణలు చేసింది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని గుర్తు చేశారు.దేశాన్ని ఏకతాటిపై నడిపే ఏకైక శక్తి ప్రధాని మోడీ అన్న విషయం మరోసారి రుజువు కాబోతుందని అన్నారు.

అదేవిధంగా అసెంబ్లీలో కష్టపడ్డ పార్టీ శ్రేణులకు మీడియాకు ఇతర వర్గాలకు ధన్యవాదాలు అంటూ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు నరసింహా గౌడ్ తెలిపారు.ఈ మీడియా సమావేశంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు చెంది మహేందర్ రెడ్డి,కక్కునూరి వెంకటేష్ గుప్తా, వంశీ, అడ్వకేట్ మనోహర్ రెడ్డి,భూషణ్,పద్మ కృష్ణయ్య,సిహెచ్ చెన్నయ్య, డాక్టర్ జడల వెంకటేష్,శ్రీశైలం, కురుమయ్య, రిషికేష్, మాజీ జెడ్పిటిసి మచ్చ సుధాకర్ రావు,గూడెం స్వామి, కురుమయ్య, రఘు రామ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణా నదికి వరద నీళ్లు వచ్చాయి...

**మక్తల్, మే 14(నమస్తే ఉదయం):**
కృష్ణా నదిలో మంగళవారం మధ్యాహ్నం వరద నీటితో కలకలలాడుతుది. ఎగువ నారాయణపూర్ డ్యాం వదిన నీళ్లు దిగువ జూరాల ప్రాజెక్టు వైపు పరుగెడుతూ తున్నాయి. మక్తల్ నియోజకవర్గంలో ప్రజలకు తాగునీరు సరఫరా చేసే మిషన్ భగీరథ పథకానికి ఇబ్బంది తోల్గిపోయింది. మంగళవారం మధ్యాహ్నం నుండి నదిలో చిన్న పాయలుగా వచ్చిన వరద పెరిగి నదిలో రెండు దత్త క్షేత్రాలను దర్శించుకునేందుకు భక్తులు వేసిన తాత్కాలిక రోడ్డు వరద తాకిడికి కొట్టుకపోయింది. మక్తల్ నియోజకవర్గంలో క్రిష్ణా నది ఒడ్డున ఉన్నా వల్లవాపురంలోని దత్త మఠంలో కోలువై ఉన్నా అతి పురాతన మైన దత్త క్షేత్రం నది మధ్యలో ఉన్న కురుమ గడ్డలో కోలువైఉన్న దత్తాత్రేయ శ్రీపాద శ్రీవల్లభుని దర్శించుకు నెందుకు నదిలో వేసిన తాత్కాలిక రోడ్డు వరద తాకిడికి కొట్టుకుపోయింది. వదరనీటిని గుర్తించిన జాలర్లు భక్తులను అప్రమత్తం చేయడంతో పెను ప్రమాదమే తప్పింది.

కృష్ణా నదిలో నీరు అడుగంటడంతో మే నెలలో తాగునీటికి ఇబ్బంది ఏర్పడుతుందని స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకెళ్ళగా తాగునీటి అవసరాల కోసం రెండు టీఎంసీల



నీటిని వదలాలని కర్ణాటక ప్రభుత్వం రిక్వెస్ట్ పెట్టగా నాలుగు రోజుల క్రితం నారాయణపూర్ డ్యాం నుండి దిగువ క్రిష్ణ నదిలోకి 1.9 టిఎంసి నీటిని నారాయణపూర్ డ్యాం నుండి దిగువ కృష్ణ నదులోకి నీటినీ వదిలారు. మంగళవారం మధ్యాహ్నం మక్తల్ నియోజక వర్గంలోని సరిహద్దులోకి వరద ప్రబావం పేరిగింది. మంగళవారం రాత్రి వరకు జూరాల డ్యాంలో చేరుకుంటాయని అదికారులు అంటున్నారు ఇకమే నెల అంతా తాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేదని అధికారులు అంటున్నారు.

# మల్కాజ్ గిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి లక్ష ఓట్ల మెజారిటీతో గెలవడం ఖాయం

**- ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్...**

**కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారందరికీ పాదాభివందనాలు...**

**కూకట్‌పల్లి,మే 14 (నమస్తే ఉదయం):**
కాంగ్రెస్ పార్టీ మల్కాజ్గిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి లక్ష కోట్ల మెజారిటీతో గెలవడం ఖాయమని ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్ ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గొల్ల జాన్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ కష్టపడి పనిచేసిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్ పాదాభివందనాలు తెలిపారు. గత నెల రోజులుగా ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి, రాత్రనకా, పగలనకా అభ్యర్థి విజయం కోసం శక్తివంచన లేకుండా కృషిచేసిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, శ్రేయోభిలాషులకు మరోమారు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా సోమవారం జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.



# ఘనంగా గూడెం సంతోష్ జన్మదిన వేడుకలు....

సంతోష్ చేత కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మిత్రులు

రాజేంద్రనగర్, మే 14(నమస్తే ఉదయం)
బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ గంధంగూడ కు చెందిన గూడెం సంతోష్ జన్మదిన వేడుకలను మిత్రులు, అభిమానులు, కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం బంధుమిత్రులతో పాటు శ్రేయోభిలాషులు సంతోష్ ను కలిసి ఘనంగా



**జన్మదినం సందర్భంగా సంతోష్‌ను సన్మానిస్తున్న మిత్రులు**

సన్మానించి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం రాత్రి కాళీ మందిర్ ప్రాంతంలో జరిగిన జన్మదిన వేడుకల్లో కిస్మత్పూర్ మాజీ ఉపసర్పంచ్, బీజేపీ సీనియర్ నాయకుడు నీరుడు శేఖర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో తోటి స్నేహితులు సంతోష్ ను ఘనంగా సన్మానించి కేక్ కట్ చేయించారు. ఈ వేడుకల్లో స్నేహితులు పిట్టల రవీందర్ ముదిరాజ్, బొట్టు మల్లేష్ గౌడ్, జగన్మోహన్ రెడ్డి, రమణారెడ్డి, గూడెం నరసింహ రెడ్డి,గుండాల వెంకటరెడ్డి,కిషోర్ బాయ్, రాం బాయ్, బాబురావు తో పాటు స్నేహితులు పాల్గొన్నారు.



# శివరాజ్ దంపతులకు స్వాగతం పలికిన మాజీ కౌన్సిలర్ వెంకటేష్

**రాజేంద్రనగర్, మే 14(నమస్తే ఉదయం):**
విదేశీ పర్యటన ముగించుకుని నగరానికి చేరుకున్న మిత్రుడు శివరాజ్ దంపతులకు బాబుల్ రెడ్డి నగర్ మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్ స్వాగతం పలికారు. శివరాజ్ దంపతులు ప్రపంచంలోనే పరుద్దేశాల్లో విహార యాత్ర కోసం బయలుదేరి విహరించి తిరిగి హైదరాబాద్ చేరుకున్నారు. మిత్రుడు శివరాజ్ విదేశీ పర్యటన చేసుకొని సందర్భంగా స్వాగతం పలుకుతూ ఎంతో సంతోషం వ్యక్తం చేశారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

**పరిస్థితి విషమం,శంషాబాద్ ఆర్గాన్ హస్పిటల్‌కు తరలింపు**

**షాద్ నగర్,మే14 (నమస్తేఉదయం):**
రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, కోమాలోకి వెళ్లిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశంపేట మండలం పాపిరెడ్డి గూడ గ్రామానికి చెందిన పోలేమోని జంగయ్య కుమారుడు పోలేమోని భాను ఉదయం డ్యూటీకి వెళ్తున్న క్రమంలో పాపిరెడ్డి గూడ నుండి వెల్జర్ల మధ్యలో ఉన్న ఆరెగూడెం మైసమ్మ వద్ద కోళ్ల వాహనం ఢీకొని ప్రమాదం జరిగిందన్నారు. గాయపడిన యువకుడిని శంషాబాద్ ఆర్గాన్ హస్పిటల్‌లో జాయిన్ చేశారన్నారు.ప్రస్తుతం కోమాలోకి వెళ్ళడం జరిగిందని తెలిపారు.





గురుకుల పాఠశాలలో సమస్యలను పరిశీలించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

# గురుకుల పాఠశాల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**మిషన్ భగీరథ సాంకేతిక లోపాలను సరిదిద్దుకోవాలి**

**కమ్మదానం గురుకుల పాఠశాలతో పాటు మిషన్ భగీరథ సమస్యలను పరిశీలించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**షాద్ నగర్,మే 14(ప్రభాత ఉదయం):**
మిషన్ భగీరథ వృధా నీటితో పాటు వర్షాలు పడ్డ సమయంలో వస్తున్న ప్రవాహంతో కమ్మదనం గురుకుల పాఠశాలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అలా జరగకుండా ప్రత్యామ్నాయ చర్యలు వెంటనే తీసుకుంటామని షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్" స్పష్టం చేశారు.ఫరూక్ నగర్ మండలం కమ్మదనం గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ విద్యాలత తదితర విద్యార్థులు తమ సమస్యలను స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తెచ్చారు.దీంతో ఎమ్మెల్యే శంకర్ వెంటనే స్పందించారు. మంగళవారం స్థానిక కమ్మదనం గురుకుల పాఠశాలను అలాగే భగీరథ వాటర్ ప్లాంట్ ను సందర్శించారు.మిషన్ భగీరథకు సరఫరా అవుతున్న నీటి విషయంలో సాంకేతిక లోపాలతో నీరు వృధాగా పాఠశాలల్లోకి వస్తుందని ఆ సమయంలో సిబ్బంది ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడంతో నీరంతా గురుకుల పాఠశాలలోకి ప్రవేశిస్తుందని పాఠశాల ప్రిన్సిపల్ విద్యాలత తెలిపారు.అయితే అదే సమయంలో వర్షాలు పడ్డప్పుడు కూడా నీరు పాఠశాలల్లోకి చేరుతుండడంతో పాఠశాల క్రీడా ప్రాంగణంతో పాటు విద్యార్థుల తరగతి గదులలోకి కూడా నీరు చేరుతుందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు.ఈ వృధా నీరు రాకుండా తమ గురుకుల పాఠశాలలో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శంకర్ ను ప్రిన్సిపాల్ విద్యాలత కోరారు. ప్రత్యామ్నాయ మార్గాలు చూద్దాం ..గురుకుల పాఠశాలలో వర్షం నీటితో పాటు మిషన్ భగీరథ నీటి సమస్య పాఠశాల విద్యార్థులకు అనేక సమస్యలు ఏర్పడుతున్న విషయమై ఎమ్మెల్యే శంకర్ మిషన్ భగీరథ ఈఈ నాగేశ్వరరావు,డిఈ సందీప్,ఏఈ రూప తదితర అధికారులతో సంఘటన స్థలంలో పిలిచి మాట్లాడారు.

ఈ సమస్యను అధిగమించాలని గురుకుల పాఠశాలకు వస్తున్న వృధా నీరు రాకుండా ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని సూచించారు.అదేవిధంగా పాఠశాల లోతట్టుగా ఉండటం వల్ల వర్షం నీరు వస్తుందని దీనిని మళ్లించేందుకు ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వన్యప్రాణులకు ఈ వృధా నీరు అవసరమయ్యేలా తాగడానికి ఈ నీరు జంతువులకు ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ నీరు పాఠశాలకు రాకుండా ఇతర స్థలానికి మళ్ళించి అక్కడ ఒక నాలుగు ఎకరాల వరకు స్థలం చూసి ఆ నీటిని అందులో మళ్లించాలని అధికారులకు చెప్పారు.అయితే ఈ విషయమై సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడతానని ప్రభుత్వం నుండి అనుమతులు తీసుకొని ఈ సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే శంకర్ భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కమ్మదనం గురుకుల హెచ్ఎం విద్యాలత, మిషన్ భగీరథ ఈఈ నాగేశ్వరరావు, డిఈ సందీప్,ఏఈ రూప, ఫరూక్ నగర్ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్ రెడ్డి,బాబర్ అలీ ఖాన్,కమ్మదనం ఎంపీటీసీ బొమ్మ అరుణ అంజయ్య గౌడ్,దేవగిరి నవీన్,లింగారెడ్డిగూడెం అశోక్, చందు, రాజు, రాఘవేందర్ , శ్రీశైలం, యాదయ్య తదితరులు ఉన్నారు.

# ప్రజాస్వామ్య భద్రంగా అధికారులు పోలింగ్ నిర్వహించారు


**- ఎన్ మల్లారెడ్డి**

**పోలింగ్ నిర్వహించిన అధికారులకు ధన్యవాదాలు**

**రాజేంద్రనగర్, మే14(నమస్తే ఉదయం):**
పార్లమెంట్ ఎన్నికలు అధికారులు ప్రజాస్వామ్య బద్ధంగా నిర్వహించారని బిజెపి చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ ఎన్ మల్లారెడ్డి అన్నారు. మంగళవారం మీడియాతో ఆయన పార్టీ నాయకులతో కలిసి మాట్లాడుతూ...

ఈ నెల 13 వ తేదీన తెలంగాణ వ్యాప్తంగా జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో పోలింగ్ జరిగిందన్నారు. ఈ ఎన్నికలు సజావుగా నిర్వహించిన ఎన్నికల కమిషనర్ , విధులు నిర్వహించిన పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బందికి ఎన్నికల్లో భాగంగా ప్రజలకు ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా సహకరించిన అధికారులందరికి ఎన్నికల్లో ఓటు వేసిన ప్రతి ఓటరు మహాశయులకు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను జాగృతం చేసిన కార్యకర్త సోదరులందరికి ధన్యవాదాలు తేపియజేసారు..

ఈ కార్యక్రమంలో అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు సాబాధ విజయ్ కుమార్, రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు కకుళారం కృష్ణ (కిట్టు) జయానంద్ రెడ్డి, అత్తాపూర్ డివిజన్ ప్రధానకార్యదర్శి సాయి యాదవ్, యువమోర్చా అధ్యక్షులు మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



**బిజెపి చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ ఎన్ మల్లారెడ్డి**

# లక్ష్మమ్మ ఉద్యోగి సేవలు మారువలేనివి

**దస్తవేజుల లేఖరీల జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య**

**ఆమె ఆత్మ శాంతికి రెండు నిమిషాలు మౌనం**

**షాద్ నగర్,మే14 (నమస్తేఉదయం):**
రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జిల్లా దస్తా వేజుల జిల్లా అధ్యక్షులు వెంకటయ్య ఆధ్వర్యంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న వడ్డేమాన్ లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతి చెందారు.

అందులో భాగంగా ఈరోజు ఫారూఖ్ నగర్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సిబ్బంది,దస్తవేజు లేకర్లు ఆమె చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఆమె చేసిన సేవలు కొనియాడారు.గత కొంతకాలంగా ఆమె క్యాన్సర్ వ్యాధితో చికిత్స పొందుతున్నారు. నిన్న అనారోగ్యంతో అనారోగ్యం తీవ్రం కావడంతో ఆమె మృతి చెందినట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి.

సీనియర్ అసిస్టెంట్ గా సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఆమె సేవలు మరువలేనివని తోటి సిబ్బంది పేర్కొన్నారు.



**సబ్ రిజిస్టర్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ వడ్డేమాన్ లక్ష్మమ్మకు ఘనంగా నివాళులు**

వడ్డేమాన్ లక్ష్మమ్మ సొంత గ్రామం నాగర్ కర్నూలు జిల్లా తెలకపల్లి మండలం నడిగడ్డలో రేపు.అనంతరం ఆమె ఆత్మ శాంతింపజేయాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు.

కార్యక్రమంలో దస్తా వేజుల జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య, పట్టణ దస్తవేజుల అధ్యక్షుడు ఒగ్గు కిషోర్,ఇంచార్జి రిజిస్టర్ రాధిక,అనిల్,శ్రీకాంత్ రెడ్డి,రాజేష్,అర్షద్, రవి,చందర్ రాజ్, విజయ్ సురేష్,అడ్డేట్ల రాజు,అడ్డే ట్ల శివ, ఆధామ్, నరేందర్, వీరెందర్,చిట్టిబాబు,శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

**Printed and Published M. DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, HNO:6-2-4/1,Shivaram pally ,Rajendranager, Ranga Reddy Dist,
Telangana State -500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally, NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.VANITHA REDDY. "RNI. Title- Code: TEL TEL 12232**. Cell: 89779 39135.